జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 2-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 151 పేజీలు: 8 వెల : రూ.7

# సిక్కోలు జిల్లాను.. అభివృద్ధి చేస్తా



* 10వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు
* టెక్కలి లేదా పలాసలో ఎయిర్ పోర్టు
* మూలపేట, ఎయిర్‌పోర్టులతో ఉపాధి అవకాశాలు
* వంశధాన, నాగావళి నదులను అనుసంధానిస్తాం
* డిసెంబరులోగా మెగా డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేస్తాం
* బెల్టు షాపులు పెడితే బెల్టు తీస్తా
* దీపం-2తో మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం
* ఈదుపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**శ్రీకాకుళం, నవంబరు 1(వార్త):** శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేసి వెనుకబడిన జిల్లా అనే పేరును తొలగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. పదివేల ఎకరాల్లో భావనపాడు పోర్టు వద్ద ఇండస్ట్రియల్ పార్కును నిర్మిస్తామని, పలాస లేదా టెక్కలి వద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపడతామని తెలిపారు. మూలపేట పోర్టు, ఎయిర్‌పోర్టుల నిర్మాణం వల్ల యువతకు ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయని, ఈ జిల్లా నుంచి వలసలు తగ్గుముఖం పడతాయన్నారు. శుక్రవారం ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో దీపం-2 పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ భావనపాడు పోర్టును టీడీపీ ప్రభుత్వమే ప్రారంభించిందన్నారు. నదుల అనుసంధానానికి ప్రాధాన్యత ఇస్తామని, కాలువల ఆధునికీకరణ, ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గాను రూ. 30 కోట్లు మంజూరు చేస్తామని తెలిపారు. బెంతు ఒరియాల సమస్యల పరిష్కారానికి అధికారులతో కలిసి చర్చిస్తామన్నారు. ప్రతి ఇంటిపై సోలార్ యూనిట్లు ప్రారంభించేందుకుగాను అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో అన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మొన్నటి ఎన్నికల్లో తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు రాజీలేని పోరాటం చేశారన్నారు. వైసీపీ నేతలు ప్రజాస్వామ్య హద్దులు దాటి ఇబ్బంది పెట్టారన్నారు. తప్పు చేసిన వారిని వదిలిపెట్టను, రాజకీయ కక్షసాధింపులకు పోను అన్నారు. గ్యాస్ సిలిండర్‌కు మీరు కట్టిన డబ్బు 48 గంటల్లో రిఫండ్ అయ్యేలా చూస్తామన్నారు. పింఛను మొత్తాన్ని మూడు నెలలకు ఒకసారి కూడా తీసుకోవచ్చన్నారు. ఉచితంగా ఇసుక ఇస్తున్న ఏకైక ప్రభుత్వం ఎన్డీయే ప్రభుత్వమన్నారు. ఇసుక విషయంలో అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్టు కింద అరెస్టు చేస్తామని హెచ్చరించారు. మా హయాంలో నాసిరకం మద్యం, బెల్టు షాపులు ఉండవన్నారు. ఎవరైనా బెల్టు షాపులు పెడితే బెల్టు తీస్తానన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉద్యోగాలు డిసెంబరు లోపు ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి జిల్లాకు వచ్చిన చంద్రబాబుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాడు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా ఇన్చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్, జల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కెవి మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్టీవో ఎం కృష్ణమూర్తి, శాసనసభ్యులు కూన రవికుమార్, గౌతు శిరీష, ఎన్.ఈశ్వరరావు, పలువురు కూటమి నాయకులు పూల బొకేలను ఇచ్చి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట, పలాస, పాతపట్నం ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, జనసేన నాయకులు పిసిని చంద్రమోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి బాబ్జి, నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు.





## టీ.. అదిరిందయ్యా.. చంద్రం

ఈదుపురంలో శాంతమ్మ ఇంట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా టీ తయారు చేశారు. ఆ టీని అందరికీ పంచిపెట్టారు. శాంతమ్మ సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అక్కడ నుంచి ఒంటరి మహిళ లబ్ధిదారు బలిజేపల్లి జానకి గృహానికి చేరుకున్నారు. ఆమెకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ.4వేలును అందించారు. ఈ సందర్భంగా ఆమెతో మాట్లాడారు. జానకి కుటుంబ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఒంటరి మహిళ పింఛన్ వల్ల తన లాంటి లక్షలాదిమందికి ఎంతో మేలు జరుగుతున్నట్లు జానకి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యమంత్రి తన ఇంటికి రావడం పట్ల ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎలాంటి కష్టం కలిగినా తాను ఒక కుటుంబ సభ్యుడిగా ఆదుకుంటారని చంద్రబాబు హామీ ఇచ్చారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కార్తీక పూజలకు సంగమేశ్వర ఆలయం ముస్తాబు





**వంగర, నవంబరు 1 (వార్త):** కార్తీక పూజలకు వంగర మండలంలోని సంగాంలోని మూడు నదుల సంగమ ప్రాంతంలో ఉన్న సంగమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పూజలు చేయనున్నట్టు దేవదాయ శాఖాధికారులు తెలిపారు. చుట్టుపక్కల గ్రామస్థులు మూడు నదుల సంగమ ప్రాంతంలో స్నానాలు ఆచరించి అనంతరం సంగమేశ్వరస్వామిని దర్శించుకుంటారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలి

### * పిడిమందస ఎంపీటీసీ మాధవరావు డిమాండ్ * కేంద్ర, రాష్ట్రమంత్రులకు వినతిపత్రాలు అందజేత

**మందస, నవంబరు 1(వార్త):** మందస మండలంలోని పలు సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలని పిడిమందస ఎంపీటీసీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వాయలపల్లి మాధవరావు డిమాండ్ చేశారు. సీఎం నారాచంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు, వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలను పలాస ఎంఎస్ఏ గౌతు శిరీషా ద్వారా అందజేశారు. మఖరజోల వద్ద గల సంకుజోడు, మూలూరుబంద, అచ్యుతాపురం వద్ద చింతలకాయచెరువు, బాలిగాం వద్ద మురిపింటి చెరువు, కొత్తచెరువు, సంతబంద, తాళ్లబద్ర వద్ద వండాయిచెరువు. రూపాయిచెరువు, కమ్మరవాని చెరువు, మామిడిపల్లి వద్ద పెద్దచెరువు, పాత్రపురం వద్ద మాలబంద, అనంతపురం వద్ద అత్తిలిబంద, గౌరకలగాయి, గొల్లపూరు వద్ద ఎర్రగండి, ఉప్పలాం వద్ద బెవరబంద, ఉప్పలాంచెరువు, కొత్తపల్లి వద్ద లోగాయి తదితర సాగునీటి వనరులు 220 ఎకరాల్లో ఉన్నాయని, 1500 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్నాయని, సుమారు 4వేలకు పైబడి ఎకరాలకు



సాగునీరు అందిస్తున్నాయన్నారు. వంశధార కాలువను పలాస మండలంలోని బొడ్డపాడు గ్రామం వద్ద గల వేపాడుచెరువు నుంచి సంకుజోడు మీదుగా ఈ సాగునీటి వనరులకు అనుసంధానం చేయాలని కోరారు. వంశధార కాలువ పొడిగించి మఖరజోల, మాలగోవిందపురం, కుంటికోట, అచ్యుతాపురం, కమలాపురం, వీరభద్ర, బాలిగాం, హరిపురం, డబారు, బిన్నల, వీవీఆర్పురం, తాళ్లభద్ర, అంబుగాం, రాణిగాం, మామిడిపల్లి, పాత్రపురం, అనంతపురం, టి.శాసనాం, గొల్లపూరు, మూలపొలం, గొడియాగట్టు, ఉప్పలాం, గోవిందపురం, కొత్తపల్లి, ముకుందపురం తదితర గ్రామాలకు రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఈ సాగునీటి వనరులు మదుములు, పరుపులు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంకుజోడు మదుములు, పరుపులు, ఫీడర్-సప్లై ఛానళ్లను తక్షణమే మరమ్మతులు చేయాలన్నారు. ఈ మైనర్ ఇరిగేషన్ జలాశయాలను బాగు చేయాలని కోరారు.



## సూపర్‌సిక్స్‌తో పేదల ఇళ్లలో కార్తీక దీపం

**ఇచ్ఛాపురం, నవంబరు1 (వార్త):** సూపర్ సిక్స్ హామీల అమలులో మొదటిదైన పేదలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇచ్చే దీపం-2 పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు అభినందనీయులని రెడ్డిక సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ కొండా శంకర్ రెడ్డి అన్నారు. ఈదుపురం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును హెలిపాడ్ దగ్గర మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

## సారవకోట కాల్ సెంటర్

**జలుమూరు/సారవకోట, నవంబరు 1 (వార్త):** సారవకోట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పింఛన్ల పంపిణీపై కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కృష్ణ మోహన్ తెలిపారు. పింఛన్ పంపిణీలో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించేందుకే ఈ కాల్ సెంటర్ దోహదపడుతుందన్నారు.

# నాగేశ్వరరావు సేవలు చిరస్మరణీయం



### * మాజీ మంత్రి శివాజీ

**మందస, నవంబరు 1(వార్త):** తెలుగుదేశం పార్టీకే జీవితాన్ని అంకితం చేసిన మాజీ ఎంపీపీ సీర నాగేశ్వరరావు చిరస్మరణీయుడని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గౌతు శ్యామ సుందర శివాజీ అన్నారు. మందస మండలంలోని జిల్లుండ పంచాయతీలోగల డిమిరియా గ్రామంలో స్వర్గీయ సీర నాగేశ్వరరావు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సీర నాగేశ్వరరావు ఎంతో కృషి, పట్టుదలతో ఎదిగారని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని సమస్యల సాధకునిగా, ప్రతీ సమస్యను పరిష్కరించడంలో ఎంతో చురుకైన పాత్ర వహించేవారన్నారు. ఎంతో సన్నిహితునిగా, కుటుంబ సభ్యునిగా సీర నాగేశ్వరరావు ఉండేవారన్నారు. ఎంపిపిగా, రాజకీయ నాయకునిగా సమస్యలను నాగేశ్వరరావు పరిష్కరించేవారని, ప్రస్తుతం ఆయన భౌతికంగా మన మధ్య లేకపోవడం ఎంతో విచారకర మన్నారు. నమ్మిన సిద్ధాంతాల కోసం, పార్టీ కోసం అహర్నిశలు నాగేశ్వరరావు కష్టపడేవారని, ఆయన లేని లోటు పార్టీకి తీరనిదన్నారు. ముందుగా నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, జీకే నాయుడు, డుంకురు తిరుపతి, రట్టి లింగరాజు, రాజాన మహేశ్, బమ్మిడి కర్రయ్య, దాసరి తాతా రావు, లబ్బ రుద్రయ్య, చౌదరి మురళీకృష్ణ, గుంట నారాయణరావు, సీర సంతోష్, పల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆటో బోల్తా

### * ఏడుగురు విద్యార్థులకు గాయాలు
### * టెక్కలి ఆసుపత్రిలో చికిత్స
### * పరామర్శించిన డీఈవో తిరుమల చైతన్య

**మెళియాపుట్టి, నవంబరు1 (వార్త):** మెళియాపుట్టి మండల కేంద్రానికి కూతవేటు దూరంలోఉన్న మార్కెట్ యార్డు సమీపంలో విద్యార్థులతో వెళుతున్న ఆటో బోల్తా పడింది. జలక లింగుపురం గ్రామానికి చెందిన ఏడుగురు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు శుక్రవారం ఉదయం ఆరున్నర గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన ఆటోలో మెళియాపుట్టి మండల కేంద్రానికి ట్యూషన్‌కు వెళుతుండగా వెనుక నుంచి మరో ఆటో ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడింది. విద్యార్థులకు గాయాలు కాగా, వారిని టెక్కలి ప్రభుత్వాసుపత్రికి








తరలించారు. ఈ ఘటనలో విద్యార్థులు కె.బాలకృష్ణ, ఎన్.నాగచైతన్య, ఎన్.మేఘన, ఎ.విష్ణుప్రియ, ఆర్.హేమలత, ఎన్.పవన్ సాయి, ఎన్. ధనుశ్రీ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. డీఈవో తిరుమల చైతన్య, ఎంఈఓ పద్మనాభంలు టెక్కలి ఆసుపత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగింది తదితర వివరాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అడిగి తెలుసుకున్నారు. పెను ప్రమాదం సంభవించినప్పటికీ విద్యార్థులంతా ప్రాణాపాయం నుంచి తప్పించుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మెళియాపుట్టి ఏఎస్ఐ నరసింగరావు తెలిపారు.




## ఎన్టీఆర్ పింఛను భరోసాతో మేలు

**మందస, నవంబరు 1(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ పింఛను భరోసా లబ్ధిదారులకు మేలు జరుగుతుందని సెర్ప్ ఏపీఎం, నోడల్ అధికారి గొడబ ప్రసాదరావు అన్నారు. మందస మండలంలోని పలు చోట్ల ఆయన పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో ఏపీఎం ప్రసాదరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, డయాలసిస్ రోగులకు ఆర్థిక భరోసాను అందిస్తూ.. పెంచిన పింఛన్లును అందజేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం పరిస్థితులు ఎన్టీఆర్ భరోసా పథకం ఓ చిన్న కుటుంబం బతకడానికి చేయూత అందిస్తుందన్నారు. పిడిమందసలో నోడల్ అధికారి ప్రసాదరావు చేతుల మీదుగా పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.కల్పన. ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళీ, ఏఎన్ఎం ఆనందమోహిని, వీఓఏ లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

## దోపిడీ శక్తులను నిలువరించేందుకు.. సమరశీల ప్రతిఘటనా పోరాటాలు అవసరం

### * సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ పిలుపు * కామ్రేడ్స్ కోరన్న, మంగన్న 57వ వర్ధంతి




**మందస, నవంబరు 1(వార్త):** అటవీ సంపదనంతా అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ దోపిడీ శక్తులకు దోచిపెట్టే కుట్రలను బీజేపీ ప్రభుత్వం సాగిస్తోందని సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆరోపించారు. శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాట తొలి అమరవీరులు కామ్రేడ్స్ కోరన్న, మంగన్న 57వ వర్ధంతి సందర్భంగా మందస మండలంలోని కొండలోగాంలో నిర్వహించిన స్మారక సభలో పార్టీ నాయకులు, పలం ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి-జనసేన-బిజెపి కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, ఆదివాసీ వ్యతిరేక చట్టాలు, నిర్ణయాలను వేగంగా అమలుజరిపేందుకు పూనుకుందని, ఎన్నికలలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర నిధులు లేవని నిస్సిగ్గుగా ప్రకటిస్తోందని, ప్రజలు ఉద్యమించకుండా, పక్కదారి పట్టించడానికి ఆరెస్సెస్-బిజెపిని మించిపోయి సనాతన ధర్మం పేరిట మెజారిటీ మతోన్మాదాన్ని రెచ్చగొట్టే చర్యలకు టిడిపి-జనసేనలు పాల్పడి తమ 'లౌకిక' ముసుగును చించేసుకున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తూర్పు కనుమలలో విలువైన బాక్సైట్ లాంటి ఖనిజాల త్రవ్వకాలకు కార్పొరేట్ కంపెనీలకు తిరిగి అనుమతి ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నదని, ప్రజాందోళనను లెక్కచేయకుండా, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో విలువైన గ్రానైట్ త్రవ్వకాలకి బడా కంపెనీకి తిరిగి అనుమతించిందన్నారు. అనుమతులను రద్దు చేసే వరకు అన్ని ప్రజా సంఘాలు తిరిగి పోరాడాలని పిలుపునిచ్చారు. కామ్రేడ్స్ కోరన్న, మంగన్నలు వంటి అమరులు చూపిన బాటలో పయనిద్దామన్నారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు (ఏఐకెయంయస్ ) గొరకాల బాలకృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, అరుణోదయ కళాకారుడు కుత్తుం వినోద్, ప్రగశీల యువజన సంఘం పివైయల్ జిల్లా కన్వీనర్ సార జగన్, ఐఎఫ్‌టియు నాయకులు పోతనపల్లి మల్లేశ్వరరావు, ఏఐకెఎంఎస్ జిల్లా కమిటీ సభ్యులు రాపాక మాధవరావు, పిఓడబ్ల్యు జిల్లా కమిటీ సభ్యురాలు కె. జానకమ్మ, జె.అప్పయ్య, పలువురు ఆదివాసీ యువకులు, మహిళలు పాల్గొని మాట్లాడారు. అరుణోదయ కళాబృందం విప్లవ గీతాలతో సభను ఉత్తేజపరిచింది.

## నేడు ఎర్రన్న వర్ధంతి సభ

**వజ్రపుకొత్తూరు, నవంబరు1(వార్త):** వజ్రపుకొత్తూరు గ్రామంలో కింజరాపు ఎర్రన్న నాయుడు 12వ వర్ధంతి సభ కార్యక్రమానికి మండల పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరుకావాలని మండల టిడిపి అధ్యక్షుడు సూరాడ మోహన్‌రావు ప్రకటనలో తెలిపారు. ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలతో పాటు నివాళులర్పించే కార్యక్రమం ఉంటుందన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ముఖ్యమంత్రిని కలిసిన బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు

**శ్రీకాకుళం, నవంబరు1 (వార్త):** శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడిని బీపీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు శుక్రవారం కలిశారు. శ్రీకాకుళం జిల్లాకు పరిశ్రమలు తీసుకువచ్చేలా కృషి చేయాలని, వలసలు, నిరోధించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు. వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాను అగ్రగామిగా నిలపాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.





## బాబు భరోసాతో ఎమ్మెల్యే బగ్గు ఉత్సాహం

**పోలాకి, నవంబరు1 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గం అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని సీఎం చంద్రబాబు హామీతో నియోజకవర్గ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఉత్సాహం కనబరిచారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యమంత్రి స్పందిస్తూ నరసన్నపేట నియోజకవర్గానికి పూర్తి సహకారం చేయనున్నట్లు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వనితమండలం వంతెన కొన్ని ప్రాంతాల్లో సాగునీరు కాలువ సమస్యలు మరికొన్ని ఇతరత్రా సమస్యలపై వివరించినట్లు తెలిసింది.

## ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

**జలుమూరు, నవంబరు 1(వార్త):**జలుమూరు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించామని హెచ్ఎం మెండ రామారావు తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ అప్పటి పరిస్థితులను తెలిపారు. తదనంతరం ఆంధ్రలో జరిగిన అభివృద్ధి తీరుతెన్నులను వివరించారు.

## మధ్యాహ్న పథకం నిర్వహణ పట్ల ఆసక్తి చూపండి

**జలుమూరు/నరసన్నపేట, నవంబరు1 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో



కొనసాగిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ పట్ల వంట ఏజెన్సీ సభ్యులు ఆసక్తి కనబరచాలని ఎంఈఓ పేడాడ దాలినాయుడు తెలిపారు. శుక్రవారం నరసన్నపేట మండలంలోని పలు పాఠశాలల్లో వంట ఏజెన్సీ సభ్యులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని విద్యార్థులకు తప్పనిసరిగా అందజేయాలని ఆదేశించారు. ముఖ్యంగా వాతావరణ మార్పులు కారణంగా వేడిగా ఉన్న ఆహారాన్ని మాత్రమే అందించాలన్నారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

నరసన్నపేట మండలంలోని దూకులపాడు గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి. దాలినాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు నిర్దిష్ట సమయపాలన పాటించాలని అన్నారు. అలాగే పిల్లల సామర్థ్యాలు మెరుగుపడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం త్రినాథ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అపార్డ్ నమోదు వేగవంతం చేయండి

**జలుమూరు, నవంబరు1 (వార్త):** రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న అపార్డ్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంఈవో బమ్మిడి మాధవరావు తెలిపారు. శుక్రవారం ఉదయం జలుమూరు మండలంలోని లింగాలపాడు పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల వివరాలన్నీ పూర్తిస్థాయిలో సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే వీటి నమోదులో మండలం 11వ స్థానంలో ఉందని మొదటి స్థానానికి చేరుకోవాలని ఆయన కోరారు. విద్యార్థుల పఠనాశక్తిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన చేయాలని చెప్పారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులకు ఎప్పటికప్పుడు అన్ని అంశాల పైన తర్ఫీదు ఇవ్వాలన్నారు. విద్యార్థుల వందశాతం ఉత్తీర్ణత, మంచి ర్యాంకుల సాధన ధ్యేయంగా పనిచేయాలన్నారు.



# ప్రతి ఇంటా పింఛన్ పండగ: ఎమ్మెల్యే గొండు

**శ్రీకాకుళం, నవంబరు1 (వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఇంట పింఛన్ పండగ వాతావరణం నెలకొందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలంలోని తండ్యంవలస శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా ముందుకు సాగుతుందన్నారు. సూపర్ సిక్స్ హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా ప్రజలతో మనల్ని అందుకుంటుందని వివరించారు. దీపావళి కానుకగా ప్రజలకు ఉచిత సిలిండర్ అందజేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. త్వరలోనే తల్లికి వందనం పింఛన్ కూడా అందించి మహిళలను అన్ని విధాలా





ఆదుకుంటామని హామీని ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ, అభివృద్ధి పనులు సరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీ

**పలాస, నవంబరు1 (వార్త):** పలాస, ఉల్లాసపేటలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శుక్రవారం ఉదయం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి ఒకటో తేది ఉదయం ఐదు గంటలకే పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారని చెప్పారు. ప్రతిపక్షం ఎన్ని విమర్శలు చేసిన ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఆమె వెంట ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, దడియాల నర్సింహులు, అంబటి కృష్ణమూర్తి, బి నాగరాజు, కార్యకర్తలు ఉన్నారు.

# శాంతినికేతన్‌లో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

**ఇచ్ఛాపురం, నవంబరు1 (వార్త):** పట్టణంలోని శాంతినికేతన్ స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో అన్యాయానికి గురవుతున్నామనే భావనతో ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిమాండ్‌కు బీజం పడిందన్నారు. ఈ క్రమంలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం, భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ఉద్యమంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1953 నవంబర్ 1న తెలుగు మాట్లాడే 11 జిల్లాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు పనిచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కే.సి. పూరి ఉపాధ్యాయులు సురేఖ పట్నాయక్, సునీత, పద్మజ, శ్రీధర్ ఇంటరక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ తేజస్, సెక్రటరీ మోహన్ ప్రియ, స్కూల్ యస్ పి ఎల్ జోత్స్న పాల్గొన్నారు.

## అమరజీవి ఆత్మత్యాగంతోనే తెలుగువారికి గుర్తింపు

**సోంపేట, నవంబరు 1 (వార్త):** దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు నుంచి బ్రిటిష్ వారి పాలనలో మద్రాసు ప్రెసిడెన్సీ లో మదరాసియులుగా తరతరాలుగా మగ్గుతున్న తెలుగు వారికి ప్రత్యేక గుర్తింపు సాధించిపెట్టిన అమర జీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం తెలుగు జాతి మరచిపోదని భిలాయి తెలుగు సమాజ్ అధ్యక్షుడు, ఛత్తీస్గఢ్ తెలుగు మహా సంఘం ఉపాధ్యక్షుడు బర్రి జోగారావు అన్నారు. ప్రపంచంలో ఏ మూల ఉన్న తెలుగు వారందరు పొట్టిశ్రీరాములుకు జన్మ జన్మల రుణపడి ఉంటారన్నారు. అమర జీవి పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద భిలాయ్ తెలుగు సమాజం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఛత్తీస్ గడ్ తెలుగు మహా సంఘం ప్రధాన కార్యదర్శి బైపల్లి తులసిరావు, కన్వీనర్ లండ రుద్రమూర్తి, బిలాయి రెడ్డి సంఘం అధ్యక్షుడు డి.కామరాజు, జర్నలిస్టుల ప్రతినిధి సహదేవ్, తెలుగు సమాజ్ సీనియర్ సలహాదారుడు జోలింగి కూర్మారావు, బిలాయ్ తెలుగు సమాజ్ ప్రధాన కార్య దర్శి యెరుపల్లి భాస్కర రావు, ఉపాధ్యక్షులు కన్నం రాజేంద్ర, కోనేరు యర్రన్న, ఆర్గనైజర్ వి.వి.యస్. సుబ్రమణ్యం, సలహాదారులు యమ్. కె. రావు, డిల్లీశ్వర రావు తామాడ, ఉప కార్యదర్శి తామడ గున్నారావు, సహాయ కార్య దర్శి వంక వెంకటరావు, కేంప్ ఏరియా ఇన్ చార్జ్ గుట్ట ఈశ్వర రావు, సెక్టర్ ఏరియా ఇన్ చార్జ్ టి.వెంకట రెడ్డి, కుర్చిపారా ఇన్ చార్జ్ ఎస్. టి.నారాయణ, సాంస్కృతిక ఇన్ చార్జ్ పుక్కళ్ళ మహేశ్ రావు, మీడియా ఇన్ చార్జ్ అర్. ఎన్.రామారావు, కార్యవర్గ సభ్యులు అర్జాల వాసుదేవ్, గోరకల శంకరరావు, బైట్కపల్లి అప్పారావు, కోవిరి రాజారావు,యెలమంచి ఉపేంద్ర రావు,అంబటి హేమరాజు, కోడ లక్ష్మీనారాయణ, జోగి దుర్యోధన, కాసా శివ, గోవింద జే జేశ్వర రావు, ఇద్ది తులసి దాస్, మైలపల్లి ఈశ్వర రావు,తోట లోక్ నాద, ఎల్. చైతన్య,సునితా మేడమ్, శ్యామ్, రీనా, తదితరులు పాల్గొన్నారు.



# జీడి కార్మికురాలికి ఆర్థిక సహాయం

**పలాస, నవంబరు1 (వార్త):** పలాసకు చెందిన జీడి కార్మికురాలు కవిత పాత్రోకు పలాస క్యాజు లేబర్ యూనియన్, రైస్ మిల్లర్ యూనియన్ రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు. కవిత పాత్రో భర్త దామోదర పాత్రో ఇటీవల అనారోగ్యానికి గురై శ్రీకాకుళం సింధూర ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధి కావడంతో మెరుగైన చికిత్స అందించేందుకు ఒక లక్ష యాభై వేల రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. కవిత పాత్రో నిరుపేద కుటుంబానికి చెందినది కావడంతో తన భర్త ఆరోగ్య నిమిత్తమై తమకు ఆర్థికంగా సహకరించాలని పలాస క్యాజు అండ్ రైస్ మిల్లర్స్ యూనియన్‌కు ఆమె కోరడంతో సంఘ పెద్దలు స్పందించారు. కవిత పాత్రో భర్త చికిత్స నిమిత్తం రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పలాస అభివృద్ధికి కృషి చేయాలి



**పలాస, నవంబరు1 (వార్త):** ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడును పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మర్యాద పూర్వకంగా కలిసి జీడి పప్పు, బొకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం పలాస నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయాలని విన్నవించారు.

### పోర్ట్ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగిస్తే..

# ప్రజా ఉద్యమం తప్పదు

* ప్రజలను తప్పుదోవ పట్టించడానికి జగన్‌పై విమర్శలు
* విలేకరుల సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్



**సంతబొమ్మాళి, నవంబరు 1 (వార్త):** ప్రభుత్వం నిర్మాణం చేపట్టి 70 శాతం పూర్తయిన మూలపేట పోర్ట్‌ను ప్రైవేటుపరం చేస్తే ప్రజా ఉద్యమం తప్పదని వైసీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ హెచ్చరించారు. సీతానగరంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పోర్టును ప్రైవేటు ఏజెన్సీకి అప్పగిస్తే మనకు, మన తరాల వారు తీవ్రంగా నష్టపోతారని, దీనిపై అన్ని వర్గాలు వారు ముందుకు వచ్చి నిలదీసి ఖండించాలని కోరారు. శరవేగంగా నిర్మాణం జరుగుతున్న మూలపేట పోర్ట్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొన్ని నెలలపాటు నిలుపుదల చేసి ఇప్పుడు కమీషన్లు, కాంట్రాక్టర్ కోసం పోర్టు పునః ప్రారంభించారని దుయ్యబట్టారు. జీఎంఆర్ వంటి బ్రహ్మాండమైన ఏజెన్సీతో భోగాపురం ఎయిర్ పోర్ట్‌ను అనుకున్న సమయానికి ముందే నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం ఇవ్వాలని చూస్తుంటే రివ్యూలు, సందర్శనలు అని చెప్పి పనులు ముందుకు సాగకుండా బ్లాక్ మెయిలింగ్ చేస్తున్నారని అన్నారు. ఎక్కడ ఏమి దొరుకుతుందని ఆశతో బాబాయ్ అచ్చం నాయుడు, అబ్బాయి రామ్మోహన్ నాయుడు పోర్ట్, ఎయిర్ పోర్ట్ చుట్టూ తిరుగు తున్నారని విమర్శించారు. అమరావతి రాజధాని కోసం పనిచేయడం వల్ల ఒకే కుటుంబంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన కింజరాపు రామ్మోహన్ నాయుడుకి కేంద్రమంత్రి పదవి, కింజరాపు అచ్చం నాయుడు కి రాష్ట్ర మంత్రి పదవిని చంద్రబాబు నాయుడు కట్టబెట్టారని అన్నారు. చంద్రబాబు నాయుడు కుటిల రాజకీయాలకు పెట్టింది పేరు అని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా ప్రజలను తప్పుదోవ పట్టించి తనకు అందిన బురదను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై జల్లుతూ కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. దీనికోసం కొన్ని మీడియా సంస్థలు, కొన్ని వర్గాలు, వ్యవస్థలు చంద్రబాబు నాయుడు కోసం పనిచేస్తున్నాయని విమర్శించారు. దీన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని త్వరలోనే బుద్ధి చెప్తారని అన్నారు. అంబేద్కర్ యూనివర్సిటీ, రిమ్స్ హాస్పిటల్, అఫ్ షోర్ రిజర్వాయర్, పోర్ట్, కిడ్నీ హాస్పిటల్ వంటి శాశ్వతమైన మంచి పనులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగాయని అన్నారు. 25 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న టిడిపి, 40 సంవత్సరాల పాటు అధికారం చేపట్టిన కింజరాపు కుటుంబీకులు ఈ జిల్లాకు ఒక్క మంచి పని అయినా చేశారా అని ప్రశ్నించారు. సమావేశంలో భావనపాడు సర్పంచ్ బి. మోహన్ రెడ్డి, ఎంపీటీసీ బి.సుధాకర్, వైఎస్ఆర్ సీపీ నాయకులు మార్పు నాగభూషణరావు, పంగరామయ్య, వాడరేవు రవి, సత్తారు సత్యం ,పోలాకి మోహన్ రావు, చిన్ని జోగారావు పాల్గొన్నారు.

## మొక్కలతోనే మానవ మనుగడ



**మందస, నవంబరు 1(వార్త):** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని తప్పక పెంచి పెద్ద చేయాలని పలువురు వక్తలు కోరారు. శ్రీసత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో భాగంగా శ్రీసత్యసాయి సేవాసంస్థలు, శ్రీసత్యసాయి ప్రేమ తరు, శ్రీసత్యసాయి సేవాసమితి(మందస) ఆధ్వర్యంలో కోటి మొక్కల పెంపకం కార్యక్రమం జరిగింది. మందస మండలంలోని అంబుగాంలోని కాంప్లెక్స్, ప్రాథ మిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూతాపం పెరిగిపోతోందని, ఇప్పటికైన మనుషులు కళ్లు తెరవాల న్నారు. అడవులను నాశనం చేసుకుని, కష్టాలను కోరి తెచ్చుకున్నామన్నారు. వేసవికాలంలో బతకలేని పరిస్థితులు ఏర్పడ్డాయని, భవిష్యత్ తరాలకు పెనుముప్పు పొంచి ఉందన్నారు. ఇప్పటికైనా మేలు కోవాలని కోరారు. మొక్కలు నాటి, వాటిని పెంచాలని.. లేనిచో మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు వద్ది అప్పారావు. జిల్లా పర్తియాత్ర ఇన్చార్జి శ్రీనివాస్, స్థానిక పెద్దలు, పర్తియాత్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.



















## 'అర్హత గల వారందరికీ పెన్షన్ల పంపిణీ'

**జలుమూరు/సారవకోట, నవంబర్ 1(వార్త):** సారవకోట మండలం గుమ్మపాడు గ్రామంలో ఎన్టీఆర్ పెన్షన్ పంపిణీ చేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ శుక్రవారం తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరికి పెన్షన్ పంపిణీ చేస్తున్నామన్నారు. అర్హత ఉండి ఇంకా ఎవరికైనా పింఛన్ అందకపోతే తమ దృష్టికి గాని, అధికారులు దృష్టికి తీసుకువస్తే పరిశీలించి వారికి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

## సజావుగా పింఛన్ల పంపిణీ

**జలుమూరు/నరసన్నపేట, నవంబరు1(వార్త):** నరసన్నపేట పంచాయతీలో ఉదయం ఐదు గంటలకే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామని ఎంపీడీవో బొడ్డేపల్లి మధుసూదనరావు తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక సచివాలయం సిబ్బంది తెల్లవారుజామునే విధులకు హాజరయ్యారని వివరించారు. ఈ క్రమంలో మాజీ ఎంపీటీసీ ప్రతినిధి నేతింటి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో బ్యాంకు వీధిలో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. శత శాతం పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు.

## సీసీడబ్ల్యూఎస్ సంస్థ ఎండిగా బొడ్డపాడు వాసి

**పలాస, నవంబరు1 (వార్త):** అండమాన్‌కు చెందిన సిసిడబ్ల్యూఎస్ సంస్థ ఎండిగా పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన బొడ్డ రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బొడ్డపాడు శ్రీ జగదీశ్వర సంఘ సభ్యులుగా ఉన్న బొడ్డ రామారావుకు బొడ్డపాడు గ్రామ ప్రతినిధులు, పలాస మండల తెలుగు యువత అధ్యక్షుడు కిక్కిరి ఢిల్లీరావు ఆయనకి అభినందనలు తెలిపారు. బొడ్డ రామారావు 1989లో సి సి డబ్ల్యు ఎస్ సంస్థలో చేరారు. సునామి సమయంలో సర్వస్వం కోల్పోయిన సరే పట్టు విడకుండా అటు కుటుంబానికి ఇటు డిపార్ట్మెంట్ కి అనేకమైన సేవలు అందించి. పిల్లలకు ఉన్నత చదువులు చదివించారు. రామారావు, ఈ సంస్థలో సుమారుగా 35 సంవత్సరాలు ఉన్నతమైన స్థానాల్లో ఉండి సేవలందించారు. ఈ సంస్థకు ఎండిగా ఉండి సేవలందిస్తూ మన బొడ్డపాడు గ్రామానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వీరు కోరారు.

## కర్ణాటకలో ఉత్తమ వైద్యాధికారిగా టెక్కలి అమ్మాయి



**టెక్కలి, నవంబరు1(వార్త):** కర్ణాటకలో వైద్యాధికారిగా పనిచేస్తున్న టెక్కలి గ్రామానికి చెందిన డాక్టర్ గజవిల్లి అనూషకి అరుదైన గౌరవం దక్కింది. కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రతి యేటా అందజేస్తున్న ఉత్తమ వైద్యుల అవార్డుల ప్రదానోత్సవం భాగంగా శుక్రవారం కర్ణాటక విజయనగర్ జిల్లా హాస్పిటల్ లో కర్ణాటక మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ ఆమెకు అవార్డును అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా ఉత్తమ డాక్టరుగా ఎంపిక అవ్వడమే కాకుండా అమే పనిచేస్తున్న హాస్పటల్ ఉత్తమ ఏరియా హాస్పటల్‌గా ఎంపిక అవ్వడం పట్ల మంత్రి ఆమెను అభినందించారు. ఉత్తమ డాక్టరుగా ఎంపికైన అనుషకి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు వైద్యాకారులు, టెక్కలి సొండికుల సంక్షేమ సంఘం అభినందించింది.

## చెట్ల కొమ్మలు తొలగింపు

**వంగర, నవంబరు 1(వార్త):** వంగర మండలంలోని తలగాం, రాజులగుమ్మడ, రుషింగి, కొప్పరవలస, బంగారు వలస, కొప్పర కొత్తవలస, రాజుల గుమ్మల, వీవీఆర్పేట గ్రామాల్లో రోడ్డుకు ఆనించి విద్యుత్ వైర్లను తాకుతున్న చెట్ల కొమ్మలను ఏఈ సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా ఉదయం 8:30 గంటల నుండి ఒంటిగంట వరకు విద్యుత్తును నిలుపుదల చేశారు.

## ఘనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం

**సంతబొమ్మాళి, నవంబరు1(వార్త):** సంతబొమ్మాళి మండల కేంద్రంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రామారావు అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలను కొనియాడారు. అమరజీవి ఫోటోకు జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లఖినాన వెంకటరమణ, నరసింహమూర్తి, హరిప్రసాద్, ఆనందరావు, సిమ్మన్న, మయూరి, భవాని, రోజా రమణి, రజిని, పావని పాల్గొన్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413